# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 64 | విశాఖపట్నం | 4-12-2025 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 64 | VISAKHAPATNAM | 4-12-2025 THURSDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934




# దేవరాపల్లిలో ఐదు ఎకరాలపై కన్నేసిన
# భూ బకాసురుడు కిలపర్తి

**దేవరాపల్లి మండలంలో భూ బకాసురుడు రెచ్చిపోతున్నాడు**

**దేవరపల్లిలో రెవిన్యూ అధికారులు మాయాజాలం**

**అడ్డగోలుగా భూ బదలాయింపు రికార్డులు తారుమారు**

**అడ్డంగా బుక్కైన రిజిస్ట్రేషన్ అధికారులు,రెవిన్యూ అధికారులు**

**277/12 సర్వే నెంబర్ లో రికార్డులు తారుమారు చేసి దోచుకున్న కిలపర్తి**

**అసలు భూమి యజమాని వెచలపు పప్పలనాయుడు అయితే, కిలపర్తి రాజేశ్వరి పేరు మీద ఎట్లా మారింది**

**నా భూమి మీదకి వెళ్లే హక్కు నాకు లేదా,వెచలపు అప్పల నాయుడు కుమారుడు,కుమార్తె**

**అసలు కిలపర్తి ఎవడు, మా భూములు దోచుకున్న దొంగ అలాంటివారికి పోలీసులు కాపలానా,బాధితుల గగ్గోలు**

**మా భూములు టాంపరింగ్ చేసి కళ్ళు ఉండు కబోధులగా వ్యవహరించిన రెవిన్యూ అధికారులు**





(పతాకం మేజర్ న్యూస్)

**అనకాపల్లి జిల్లా, దేవరాపల్లిలో భూబకాసురుడు ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. నిత్యం వివాదాలు వెంటాడుతున్నా, జనం దుమ్మెత్తి పోస్తున్నా, బాధితులు కడుపు మంటతో తరిమికొడుతున్నా,పట్టింపు లేదన్నట్టుగా అధికార పార్టీ నేతలు అండతో చెలరేగిపోతున్నాడు కిలపర్తి భాస్కరరావు.**

ఇప్పటికే కబ్జాల పర్వం కొనసాగించిన భూకాసురుడు తాజగా సర్వే నెంబర్ 277/12లో ఉన్న వేచలపు అప్పలనాయుడు S/o అప్పలనాయుడుకి చెందిన ఐదున్నర ఏకరాలపై కన్నేసాడు. 2010 పదిలో అసలు వారసులకు తెలియకుండానే కిలపర్తి రాజేశ్వరి పేరుమీద రిజిష్టేషన్ చేసారు..దీనితో బాదితులు విషయం తెలుసుకోని లబోదిబోమంటున్నారు.మూడు నెలల క్రితం ఇక్కడ భూమి ధరకు రెక్కలు రావడంతో అమ్మకానికి పెట్టాడు.కోట్ల విలువైన పేద ప్రజలు భూమిని కబ్జా చేసేందుకు టిడిపిలో చేరి బండారు అండతో కబ్జాకు బాటలు వేశాడు.దీనిపై అధికారులు సైతం తేలు కుట్టిన దొంగల్లా మౌనముద్ర దాల్చుతూ అక్రమార్కులుకు కొమ్ము కాస్తున్నారు.కోట్ల విలువైన భూమిని యంత్రాలతో చదును చేశారు.మట్టితో ఆ భూమిని కప్పి దోచుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు దేవరాపల్లి భూబకాసురుడు అంతు చిక్కినీ అవినీతి,అక్రమాలు, భూమి కబ్జాలు చేయడం దోచుకోవడం కోట్లాది రూపాయలు భూమిని అన్యాక్రాంతం చేయటం కిలపర్తి భాస్కరరావు రాజకీయ అండతో రెచ్చిపోయి దోచుకుంటున్నాడంట.. ఒకపక్క అధికారులు మరియు రెవిన్యూ సిబ్బంది కలిపి పేద ప్రజలు రైతులు భూమిలు దోచుకున్నారు. దీనిపై అధికారులు సైతం మాకు ఏమి తెలియదు అని మొగమాటం లేకుండా చెప్పుతున్నారు

దీని బట్టి చుస్తే అధికారులు,కబ్జాలు కింగ్ కిలపర్తి కలిపి దేవరాపల్లి మండల పెదభూములు దోచుకున్నారు అని స్పష్టంగా బహిరంగా రహస్యం ఏమి లేదు అని దోచుకన్నాము అని చెప్పుతున్నారు.



రోడ్డు మీదుకు వచ్చిన బాధితులు

## రైతు ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా
# పని చేస్తున్నాం: చంద్రబాబు

**తూర్పుగోదావరి జిల్లా, పతాకం న్యూస్:** ఆంధ్రప్ర దేశ్‌లో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతు ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకోసం 'పంచసూత్రాల'ను అమలు చేస్తున్నా మని, ప్రతి రైతు వీటిని ఆచరించి లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. 'రైతన్నా... మీ కోసం' సభలో ప్రసంగిం చిన ఆయన, గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. గత ఐదేళ్లలో జరిగిన భూ అవకతవకలను, ల్యాండ్ గోల్మాల్‌ను సరిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారించానని చంద్రబాబు తెలిపారు. తమకు నచ్చిన భూములు ఇవ్వని వారిని 22-ఏ జాబితాలో పెట్టి వేధించారని, వాటన్నింటినీ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని హామీ ఇచ్చారు. నాటి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని, పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి కూటమి ఏర్పడిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, దీపం-2.0 కింద మూడు ఉచిత సిలిండర్లు వంటి పథకాలను వివరించారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రోడ్లపై ఒక్క గుంత కూడా లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయమే రాష్ట్రానికి బలమని, పోలవరం పూర్తిచేసి, నదుల అనుసంధానం ద్వారా ప్రతి పొలానికి నీరందిస్తామని చెప్పారు.



మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు పంటల సరళిని మార్చుకోవాలని, అంతర పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఏపీ వ్యవసాయ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. అనంతరం సీఎం మాట్లాడుతూ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని, అలా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు.

## రూ.10వేల లంచం తీసుకుంటూ
# ఏసీబీకి చిక్కిన ఏఎస్‌టీవో కృష్ణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ సర్కిల్ 3 ఏ.ఎస్.వో.టీ కృష్ణ 10వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా గాజువాక మండలంలో పది వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు పట్టుబడ్డ సర్కిల్ -3 ఏ.ఎస్.వో టీ. కృష్ణ . ఆరు నెలల క్రితం రేషన్ బియ్యంతో పట్టుబడిన రెండు ఆటోలని పట్టుకున్న సివిల్ సప్లై అధికారులు. పట్టుబడిన ఆటోలను విడుదల చేయమని హైకోర్టు ఆదేశాలు అనుసరంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కూడా భాధితుల పక్షాన ఆటోలు విడుదలకి సర్కిల్ -3 ఏ.ఎస్.వో కృష్ణకి ఆదేశాలు. రెండు ఆటోలు విడుదలకి నెల రోజులగా ఏ. ఎస్. వో కృష్ణ చుట్టు తిరిగితున్న బాధితులు.ఆటోలు విడుదలకి 10 వేలు డిమాండ్ చేసిన ఏ. ఎస్. వో కృష్ణ. లంచం ఇవ్వడానికి ఇష్టపడని బాధితులు ఏసీబీ అధికారులకి ఫిర్యాదు చేసారు. బుధవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకి పట్టుబడ్డ ఏ. ఎస్. వో కృష్ణ. కేసు నమోదు చేసి ఏసీబీ డిఎస్పీ రమణ మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## పెరుగుతున్న విపత్తుల తీవ్రత

భూ వాతావరణం మారుతున్నకొద్దీ తుపాన్లు, వరదలు తరచుగా, విస్తృతంగా విరుచుకుపడుతున్నాయి. ఈ సంవత్సరం దక్షిణాసియాలో కురిసిన భారీ వర్షాలు, వాటి కారణంగా వచ్చిన వరదలు థారులాండ్, ఇండోనేషియా, శ్రీలంకల్లో తీవ్ర నష్టం కలిగించాయి. వెయ్యికి పైగా మరణాలకు కారణమయ్యాయి. మన దేశంలోనూ నష్టాలు కనిపించాయి. మన రాష్ట్రంలో పెద్దగా ప్రాణ నష్టం కనిపించనప్పటికీ, పొరుగు రాష్ట్రాల్లో కొందరి ప్రాణాలు పోయాయి. దిత్వా తుపాన్ శ్రీలంకలో సృష్టించిన బీభత్సం కళ్లముందే కనపడుతోంది. సెన్యార్ తుపాన్ కూడా శ్రీలంక, సుమత్రాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. అక్కడ నగరాలు, గ్రామీణ ప్రాంతాలన్న తేడా లేకుండా విలయం చోటుచేసుకుంది. ఇంతకు ముందెన్నడూ చూడనంత తీవ్ర ఇబ్బందులను ఎదుర్కున్నామని రక్షణ బృందాలు చెబుతున్నాయి. ఆ స్థాయిలో కాకపోయినా మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోనూ భారీ నష్టం చోటుచేసుకుంది. ఈ రెండు తుపాన్ల కారణంగా ఆ రాష్ట్రంలో 57వేలహెక్టార్లు పైగా పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా! పూర్తి స్థాయి గణాంకాలు ఇంకా సిద్ధం కావాల్సి ఉంది. తుపాన్లను ఎదుర్కోవడంలో మన దేశంలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని అధికార యంత్రాంగం మంచి అనుభవాన్ని సాధించింది. దానికి తగ్గట్టుగానే వాతావరణ కేంద్రం నుండి అందే హెచ్చరికల ఆధారంగా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం, తీర ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటివి కొంత కాలంగా అలవాటైన చర్యలు! అప్పుడప్పుడు వాతావరణ హెచ్చరికలు నూరు శాతం నిజం కాకపోయినా, ప్రజా ప్రయోజనాల రీత్యా రక్షణ చర్యలు తీసుకోవడం మాత్రం తప్పనిసరి! వాతావరణ విపత్తుల తీవ్రత అంతకంతకూ పెరుగుతోంది. ప్రతి విపత్తు పెను ముప్పుగా మారుతోంది. అలాగే వాటి సంఖ్య కూడా పెరుగుతూ ఉంది. మన దేశం కూడా ఈ పరిస్థితికి మినహాయింపు కాదు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్‌ఇ) చేసిన అధ్యయనం ప్రకారం దేశ వ్యాప్తంగా 2022 నుండి ఇప్పటివరకు 1,227 రోజుల పాటు ప్రతి ఒక్క రోజూ ఏదో ఒక వాతావరణ విపత్తు చోటుచేసుకుంది. అతివష్టి, వేడి గాలులు, వడగండ్ల వాన, తుపాను, వరదలు ఇలా ఏదో ఒకటి దేశంలో ఏదో ఒక ప్రాంతంలో ఈ రోజుల్లో నమోదైంది. ఇన్ని రోజుల పాటు విపత్తుల నమోదు కావడమన్నది గతంలో ఎన్నడూ లేని దుస్థితి. శీతాకాలంలో వడగాలులు, వేసవిలో ముంచెత్తే వానలు, రుతుపవనాల మధ్యలో పొడి వాతావరణం నెలకొనడం వంటి అసాధారణాలు సాధారణమవుతున్నాయి. ఫలితంగా ఒకప్పుడు క్రమం తప్పకుండా పలకరించే రుతువులు ఇప్పుడు గతి తప్పుతున్నాయి. వ్యవసాయ చక్రాలు మారిపోతున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా మార్చిలోనే పాఠశాలలు వేసవి సెలవులను ప్రకటిస్తున్నాయి. వర్షాల కారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో కూడా విద్యాసంస్థలు మూసివేయాల్సి వస్తోంది. ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు. ధనిక దేశాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా ఏటా భూతాపం పెరుగుతూనే ఉంది. హరిత గహ వాయువుల మోతాదు చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయికి చేరుకుంది. ఫలితంగా సముద్ర జలాల వేడి కూడా భారీగా పెరుగుతోంది. ఇవన్నీ భారత ఉపఖండంలోని సముద్రాలలో చోటుచేసుకుంటున్న తుపాన్ల సంఖ్య, తీవ్రత, మార్గాలన్నింటిని మార్చి వేస్తున్నాయి. ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ వైపు దూసుకువెళ్లే అత్యధిక తుపాన్లు, ఇప్పుడు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు మళ్లుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. దిత్వా తుపాన్ గమనమే దీనికి తాజా ఉదాహరణ. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఉన్న హెచ్చరికల వ్యవస్థలు, తీసుకుంటున్న రక్షణ చర్యలు రానున్న రోజుల్లో ఏమాత్రం చాలవు. మన వ్యవస్థలను మార్చుకోవాల్సి ఉంది. అనూహ్యమైన చోట విరుచుకుపడుతున్న వరద నీటిని నిల్వ చేసే విధానాలను రూపొందించాలి. నగరాలు, పట్టణాల్లో ముంపును నివారించేందుకు అధునాతన డ్రైనేజ్ వ్యవస్థతో కూడా ప్రణాళికలను అమలు చేయాలి. సముద్రతీర ప్రాంతాల్లో బఫర్ జోన్‌లు, మడ అడవుల పునర్నిర్మాణం వంటి చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. రైతాంగాన్ని ఆదుకునేందుకు వాతావరణ బీమాను అమలులోకి తీసుకురావాలి. అప్పుడే విపత్తులు సృష్టించే విలయం నుండి కొంతమేరకైనా భరోసా ప్రజలకు దక్కుతుంది.

## పైలెట్ల కొరతతో పలు ఇండిగో విమానాలు రద్దు



**ముంబై:** పైలెట్ల కొరతతో పలు ఇండిగో విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని విమానాలు ఏడుగంటలకు పైగా ఆలస్యంగా నడుస్తున్నాయి. క్యాబిన్ సిబ్బంది హాజరుకాకపోవడంతో బుధవారం పరిస్థితి మరింత తీవ్రమైనట్లు ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. నవంబర్ 1 నుండి అమల్లోకి వచ్చిన కఠినమైన విశ్రాంతి మరియు విధుల నిబంధనలను పూర్తిగా అమలు చేయడంతో పైలెట్ల కొరత ఏర్పడినట్లు సమాచారం. పైలెట్‌లను సిక్‌లీవ్‌ల నుండి త్వరగా విధుల్లోకి చేరాలని, ఇతరులను వారి ప్రివిలేజ్ లీవ్‌లను వదులుకోవాలని ఇండిగో కార్యకలాపాల బృందం గత కొన్ని వారాలుగా సిబ్బందిపై ఒత్తిడి తెస్తోంది. డిసెంబర్ 2న ఎయిర్‌లైన్ విమానాల్లో 35శాతం మాత్రమే సకాలంలో నడిచాయని, డిసెంబర్ 1న 49.5శాతం సకాలంలో నడిచినట్లు ప్రభుత్వ డేటా వెల్లడించింది. కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ముంబయి-మాల్దీవుల సర్వీస్‌తో సహా అనేక విమానాలు ఆలస్యమయ్యాయని ఇండిగో పేర్కొంది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో వరుసగా రెండవ రోజు అనేక ఇండిగో విమానాలు రద్దయ్యాయి. హైదరాబాద్‌లో సుమారు 19 ఇండిగో విమానాలు రద్దు చేయబడ్డాయి.

## పర్వతాల విషయంలో కేంద్రం కొత్త మార్పులు.. సోనియా గాంధీ తీవ్ర ఆగ్రహం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆరావళి పర్వత శ్రేణికి సంబంధించి కేంద్ర పర్యాటక శాఖ నూతన మార్పులు తీసుకువచ్చింది. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ ఆరావళి పర్వతాల విషయంలో సవరణలు చేసింది. దీనిపై ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తీవ్రంగా స్పందించారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంట్ లాంటివని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థకు రాసిన కథనంలో ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాటిలోని కొన్ని అంశాలను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంది. గుజరాత్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలకు దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక స్థానం ఉందని ఆమె అన్నారు. అక్రమ మైనింగ్ కారణంగా ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చిందని అన్నారు. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించడం మైనింగ్ మాఫియాకు బహిరంగ ఆహ్వానం పలుకడమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ఇది వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## రైతాంగ సమస్యలు పట్టించుకోండి: మధు




**తిరుపతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు న్యాయం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు పి మధు డిమాండ్ చేశారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా అప్పులు పాలవుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల వద్దకు క్షేత్రస్థాయిలో వెళ్లి వారి సమస్యలు గుర్తించి పరిష్కరించేలా చూడాలని సమావేశాలు, సభలు నిర్వహించడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వరి పంట కనీసం మద్దతు ధర కూడా లేకపోవడంతో రైతులు ఉభయగోదావరి జిల్లాలో ఉండే రైతులు నష్టపోయారన్నారు. ఒక ఎకరాకు వరి 10 నుంచి 20 బస్తాలు దిగుబడి తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టో రైతుల గురించి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఏది అమలు కావడం లేదు అన్నారు. టిడిపి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో 20 వేలు, ఇస్తామని ప్రకటించి, మొదటి విడత ఇవ్వలేదన్నారు. కౌలు రైతులు కూడా అన్నదాత సుఖీభవ పథకంలో ఇస్తామని చెప్పి వారిని కూడా చేర్చకపోవడం దారుణం అన్నారు. కౌలు రైతులకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామని చెప్పిన చంద్రబాబు వాటిని ఎంతవరకు అమలు చేయలేదన్నారు. 23 రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్రం ప్రకటించిందని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క పంట కూడా గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో రైతులు అప్పుల్లో కూలిపోయారని వెల్లడించారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతున్న రైతులకు పండించే పంటలు గిట్టుబాటు ధర ఒకపక్క ఇవ్వకపోగా, ఇంకొకపక్క యూరియా ధరలు బస్తాపై 100 నుంచి 150 రూపాయలు అదనంగా పెరిగిపోయాయని తెలిపారు.

## వలసలపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే ఆ దేశాలే నష్టపోతాయి: జైశంకర్ హెచ్చరిక




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమ దేశాలలోని వలస వ్యతిరేక విధానాలపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా, ఐరోపా దేశాల్లో వలసలపై ఆంక్షలను తప్పుబట్టారు. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే ఆయా దేశాల సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందని, వారే నష్టపోతారని హెచ్చరించారు. చాలా సందర్భాల్లో వారే ఈ సమస్యను సృష్టించారని, కాబట్టి స్వయంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతిభా ప్రవాహానికి అడ్డంకులు ఏర్పరచడం సరికాదని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలకు, ఆయా దేశాల్లోని సంక్షోభానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. వలసలకు సంబంధించి అమెరికా, ఐరోపా దేశాల్లో ఏమైనా ఆందోళనలు ఉంటే అవి ఆ దేశాలు అమలు చేసిన దీర్ఘకాలిక విధానాల ఫలితమే అన్నారు. గత రెండు దశాబ్దాలలో ఉద్దేశపూర్వకంగా, అన్నీ తెలిసే తమ వ్యాపారాలను వ్యూహాత్మకంగా విదేశాలకు విస్తరించాయని ఆయన పేర్కొన్నారు. కాబట్టి ఈ సమస్యకు స్వయంగా వారే పరిష్కార మార్గాలు చూపించాలని అన్నారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల ప్రవాహం ఇరు దేశాలకు ప్రయోజనమని వారు గుర్తించాలని ఆయన అన్నారు. ప్రపంచం ఆధునాతన తయారీ రంగం వైపు మళ్లుతున్న కొద్దీ, నైపుణ్యం కలిగిన ప్రతిభ అవసరం పెరుగుతుందని అన్నారు. ఏ దేశం కూడా స్వయంగా సరిపడా సంఖ్యలో నిపుణులను వేగంగా తయారు చేయలేదని అన్నారు.

## అభివృద్ధిలో జనసేన శ్రేణులు భాగం కావాలి: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అభివృద్ధిలో క్రియాశీలక భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన సమావేశమై పార్టీ నిర్మాణంపైనా, భవిష్యత్ కార్యాచరణపైనా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకు స్థానిక అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ లక్ష్య సాధన కోసం గ్రామ స్థాయి నుంచి పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పవన్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించాలని, వారు స్థానిక అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని చెప్పారు. ఇదే తరహాలో మండల, అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో ఇప్పటికే ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, దాని పనితీరును సమీక్షించి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని వివరించారు. పార్టీ కమిటీల నియామకంలో మహిళలకు తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ స్పష్టం చేశారు. ఐదుగురు సభ్యుల కమిటీలో కనీసం ఒకరు, గరిష్టంగా ఇద్దరు వీర మహిళలు ఉండాలని, 11 మంది సభ్యుల కమిటీలో ముగ్గురికి స్థానం కల్పించాలని నిర్ణయించారు. పార్టీలో అంతర్గత వివాదాల పరిష్కారం కోసం కేంద్ర కార్యాలయం పర్యవేక్షణలో 11 మంది సభ్యులతో 'కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్' విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే భర్తీ అయిన నామినేటెడ్ పదవుల వివరాలను సమీక్షించిన పవన్, మిగిలిన పదవుల భర్తీలో కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని సూచించారు.

## "అరకు సంతబయలు" వద్ద గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై గిరిజన సంఘం ఆగ్రహం- అధికారుల నిర్లక్ష్యం పట్ల తీవ్ర ఆందోళన



**దుంబ్రిగూడ, పతాకం న్యూస్:** అరకు సంత ప్రాంతంలో గిరిజనేతరులు అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు కనీసం స్పందన కూడా చూపడం లేదని గిరిజన సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల గిరిజన సంఘం కార్యదర్శి తామర్ల సూర్యనారాయణ, అధ్యక్షులు పాంగి సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ, 1/70 చట్టం, పీసా చట్టం ఉన్నా గిరిజన హక్కులను కాలరాస్తూ గిరిజనేతరులు భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యం వల్లే సాధ్యమవుతోంది అని మండిపడ్డారు. అరకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఆమడ దూరంలోనే గిరిజనేతరుడైన నందీశ్వరరావు అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్నా అధికారులు మౌనంగా ఉండటం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటికే నందీశ్వరరావు పలు ఇళ్లు, వాణిజ్య భవనాలు నిర్మించుకున్నాడని, ఇలాంటి అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, గిరిజన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే తీవ్ర ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# దివ్యాంగుల ఆత్మగౌరవం మా ప్రాధాన్యం: స్పీకర్ అయ్యన్న



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** దివ్యాంగులు గౌరవంగా జీవించేందుకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం నర్సీపట్నంలో దివ్యాంగులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన, వారి సమస్యలను ఓర్పుగా విని తక్షణ పరిష్కారానికి భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో చర్చిస్తానని, అలాగే రిజర్వేషన్‌ను మరో 1%-%2 శాతం పెంచే ప్రతిపాదనను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు నెలకు 35 కేజీల బియ్యం వచ్చేలా అంత్యోదయ కార్డుల మంజూరుపై సానుకూలంగా స్పందించారు. "ఇది రాష్ట్ర స్థాయి అంశం త్వరలోనే పరిష్కారం చూపిస్తాం" అని స్పష్టం చేశారు.

అలాగే దివ్యాంగుల స్వయం చలనానికి తోడ్పడే విధంగా, రూ. 2 లక్షల విలువైన ఆధునిక జాయ్ స్టిక్ బ్యాటరీ వాహనాలను సిఎస్ఆర్ నిధుల ద్వారా ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలోని దాదాపు 30 పరిశ్రమలతో చర్చించి 60 మందికి పైగా లబ్ధిదారులకు వాహనాలు అందజేస్తాం అని హామీ ఇచ్చారు. వాహనాలు నడపడానికి అవసరమైన కనీస శిక్షణతో పాటు లైసెన్సులు కూడా ఇప్పించే బాధ్యత తీసుకుంటామని భరోసా నిచ్చారు. దివ్యాంగుల సంఘం భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించామని, అలాగే వారు గ్రూపులుగా ఏర్పడితే బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేలా పూర్తి సహకారం అందిస్తానని స్పీకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పరిధిలోని దాదాపు వందమంది దివ్యాంగులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగి మండలంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రంపచోడవరం నియోజవర్గంలో వైసీపీలో నుండి పలువురు ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి ఆధ్వర్యంలో తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని చెరుకుంపాలెంలో పార్టీ నియోజకవర్గం పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు,ఏపీ ఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు సౌజన్యంలో పార్టీలో చేరిన వారి విషయమై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన, రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న సంస్కరణలు చాలా ఉపయోగ కరంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమాల్లో కూటమి సర్కార్ పరుగులు పెట్టిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్న విధానానికి ఆకర్షితులై పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ఇప్పటికే పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారన్నారు. రాజవొమ్మంగి మండలం నుండి తెదేపా తీర్థం పుచ్చుకున్న వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెరుకుంపాలెం పంచాయతీలో వైఎస్సార్ సీపీ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు నచ్చి సుమారు 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీకండువాలు కప్పుకున్నారు. తెదేపా తీర్థం స్వీకరించిన వారిలో సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు మడకం కమలాదేవి, కొప్పిశెట్టి వీరబాబు, యల్లపు వెంకన్న, చింతలపూడి సత్యవతి, బర్నికల శ్రీను, పూసం సత్తిబాబు, పొడుగు లక్ష్మీ, కొడవలి రాజు, పొత్తూరి గణపతి, మిరియాల మల్లేశ్వరరావు, మిరియాల సత్తిబాబు, కుంజం బాలరాజు, కుంజం నాగేష్, బర్నికల అప్పన్న తదితర 100 కుటుంబాలు పార్టీలో చేరగా ఆమె ఆహ్వానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, ఏఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సీనియర్ నాయకులు గణజాల తాతారావ్, ఎంపిటిసి మీనవల్లి సుబ్బారావు, ఎంపిటిసి నల్లా సత్తిబాబు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, పార్టీ నాయకులు జెట్టి మధు, సూరిశెట్టి సురేష్, తమదాల సత్యనారాయణ, ఏఎంసి డైరెక్టర్ గట్టి మాణిక్యం, తెలుగు యువత నాయకులు బారంగి అనుదీప్, కంటపురెడ్డి వీరబాబు, చలుమర్తి బన్ను, చెక్కా లోవరాజు, విసంశెట్టి సత్తిబాబు, వానపల్లి చిట్టిబాబు, తేజ, రెడ్డి రమణ, గొర్లె సీతాంబరం, ముర్ల వీరబాబు, ఎలిసెట్టి భద్రం, కోటంశెట్టి సత్తిబాబు, ముప్పన మోహన్, పల్లాల బాలురెడ్డి, పీరు వీరభద్రరావు, చలుమర్తి దుర్గాప్రసాద్, పడాల కాటమస్వామి, షేక్ బాజీ, వరదా సత్తిబాబు, కుంజం అబ్బాయిదొర, నందా రాంబాబు , బొడ్డు దుర్గాప్రసాద్, బొడ్డు వెంకన్న, మీనవల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



**మల్కాపురం, పతాకం న్యూస్:** స్థానిక జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గల భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం అంగరంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరావు మల్కాపురం స్కూల్ కాంప్లెక్స్ హెచ్.ఎం అరుణ కుమారి మరియు జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ మల్కాపురం హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.దివ్యాంగుల దినోత్సవం లో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పోటీ కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందచేయటం జరిగింది. అదేవిధంగా దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రం ద్వారా పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు ఇతర రాయితీలు గురించి తల్లితండ్రులకు వివరించారు .పిల్లలు భవిత కేంద్రంలో చక్కగా చదువుకుని భవిత కేంద్రానికి పరిమితం కాకుండా సహిత విద్యలో భాగంగా పిల్లలు అందరూ సాధారణ పాఠశాలకు వెళ్లాలని సూచించారు . ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి మరియు మాధురి పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన



**రోలుగుంట, పతాకం న్యూస్:** జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం జె.నాయుడుపాలెంలో బుధవారం లేగ దూడల ప్రదర్శన జరిగింది. కుసర్లపూడి ఇంచార్జి పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు పర్యవేక్షణ లో స్థానిక గోపాలమిత్ర సన్యాసినాయుడు,సచివాలయం అసిస్టెంట్ జగదేశ్వరీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి(ఈఓ) డాక్టర్ సజ్జా శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు డాక్టర్ పుష్ప,నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య,గ్రామ సర్పంచ్ రమణ ప్రారంభించారు.ఆడపెయ్యిలు పుట్టించే లింగ నిర్ధారిత వీర్య నాళికలు వినియోగం పై పాడి రైతులుకు ప్రత్యక్ష అవగాహన కల్పించే ఉద్దేశంతో మేలు జాతి లేగ దూడల ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెర్సీ, హెచ్ఎఫ్,ముర్ర,పుంగనూరు, ఒంగోలు,గిర్ వంటి వివిధ జాతులకు చెందిన 46 పెయ్యలను ప్రదర్శించారు.ఆడపెయ్యల పుట్టించే వీర్యనాళికలతో పుట్టిన రెండు పెయ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.దేశవాళీ జాతి పుంగనూరు,గిర్ పెయ్యలు ఆకర్షించాయి.బుచ్చెం పేట,కొత్తకోట పశు వైద్యులు డాక్టర్ దమయంతి, డాక్టర్ బాలతేజ న్యాయ నిర్ణేతలు గా వ్యవహరించి మూడు ఉత్తమ దూడలు ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. సంచార పశు వైద్య సేవలు గురించి శ్రీదేవి,శివ వివరించారు. కొత్తకోట పశు వైద్యాధికారి డాక్టర్ బాలతేజ లేగదూడల పెంపకం, యాజమాన్యంపై అవగాహన కల్పించారు.ఆడపిల్లలు మాత్రమే పుట్టించే కృత్రిమ గర్భధారణ వీర్య నాళీకల సాంకేతికతను తెలియజేసి వాటి సక్రమ వినియోగంపై డాక్టర్ దమయంతి అవగాహన కల్పించారు.అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న లేగ దూడలు అన్నింటికి బలవర్ధక మందులు,నట్టల నివారణ మందు,మినరల్ మిక్సర్ ఉచితంగా అందజేశారు.బలిజపాలెం గోపాలమిత్ర చిన్నం నాయుడు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది వల్లిక, రాజు,శ్రీను,అశ్వినీ,కృష్ణ, సత్తిబాబు,హారిక,ప్రసాద్,రమణ, మరియు 34 మంది పాడిరైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-1 సిహెచ్. తలుపులు మాట్లాడుతూ దివ్యాంగులు ప్రత్యేకమైన ప్రతిభ, తెలివితేటలు కలిగి ఉంటారని, వీరికి చిన్న సహాయం అందిస్తే ఉన్నత స్థాయికి చేరుకునే సామర్థ్యం ఉన్నదని పేర్కొన్నారు. ఎంఈఓ-2 నాగేంద్ర మాట్లాడుతూ దివ్యాంగులపై జాలి చూపడం కాదు, అవసరమైన సహాయం, ప్రోత్సాహం అందించడం ముఖ్యం అని అన్నారు. కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు డి.జి. నాథ్, స్పెషల్ ఎడ్యుకేటర్ బి. అప్పారావు, ఐఈఆర్పీ సాలపు దేముడు నాయుడు, చిట్టి కమల, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పోస్టులను స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలి



**అరకులోయ, పతాకం న్యూస్ :** పాడేరు ఏజెన్సీ పరిధిలోని అరకులోయ, పాడేరు, చింతపల్లి కేంద్రాల్లో రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు నెలల ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోర్సుల్లో కోఆర్డినేటర్ పోస్టుల నియామకంలో స్థానిక గిరిజన నిరుద్యోగ యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజన యువత తీవ్రంగా డిమాండ్ చేస్తోంది.గిరిజన ప్రాంతాల్లోనే నైపుణ్యం, అర్హత కలిగిన అనేక మంది గిరిజన యువత ఉన్నప్పటికీ, ఈ పోస్టులకు మైదాన ప్రాంతాల నుంచి అభ్యర్థులను నియమిస్తుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మా ప్రాంతంలోనే శిక్షణ పొందిన, స్థానిక భాష, సంస్కృతి, సమస్యలు అర్థం చేసుకున్న గిరిజన యువత ఉండగా, బయటి వాళ్లను ఎందుకు తీసుకువస్తారు. ఇది స్థానికులకు చేస్తున్న అన్యాయం అని గిరిజన నిరుద్యోగ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే విద్య, ఉపాధి అవకాశాల కోసం గిరిజన యువత పోరాడుతున్న సమయంలో, తమ ప్రాంతంలోని ఉద్యోగ అవకాశాలను కూడా మైదాన ప్రాంతీయులకు కట్టబెట్టడం సహించరాని విషయమని వారు అంటున్నారు.గిరిజన ప్రాంతాల్లో పనిచేయడానికి సిద్ధంగా, శిక్షణ పొందిన మా యువత ఉండగా వారిని పక్కన పెట్టడం బాధాకరం అని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కోఆర్డినేటర్ పోస్టుల నియామకంలో గిరిజన యువతకు అగ్ర ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన యువత కోరుతోంది. లేకపోతే ఉద్యమం తప్పదని కొందరు హెచ్చరిస్తున్నారు.

## పీఎంజే జువెలరీస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి పట్టణం మెయిన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటుచేసిన పీఎంజే జువెలరీస్ వారి 43వ బ్రాంచ్ ప్రారంభోత్సవ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ అనకాపల్లి కి కనకాపురి అని పేరు ఉండేదని ఆ పేరు ఇప్పుడు సార్థకం అవుతుందని, అప్పట్లో బంగారం ఉంటే అనకాపల్లి ఉండేదని, అలాగే నాతో ఎంతో అనుబంధం ఉన్న సినీ నటుడు కృష్ణ మనవరాలు అంబాసిడర్ గా ఉన్న పీఎంజే జువెలరీస్ అనకాపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయడం ఆహ్వానించతగ్గ విషయమని, క్వాలిటీ బంగార ఆభరణాలు, క్వాలిటీ డైమండ్స్ కొనుగోలుదారుడు కి నమ్మకం నిలబెట్టే విధంగా ఉంటూ ఇలాంటి షోరూంలు మరిన్ని ఓపెన్ చేయాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

## అనాధలకు దుస్తుల పంపిణీ చేసిన జనసేన నేత రాజాన వీర సూర్యచంద్ర



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర మరోసారి తన మానవతా గుణాన్ని చాటుకున్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని అనాధలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు శీతాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని దుస్తులను పంపిణీ చేశారు. సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి అవసరమైన బట్టలు అందించిన ఆయన సేవా కార్యక్రమంపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి వ్యక్తికి కనీస జీవన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించడం ప్రతి పౌరుడి బాధ్యత అని చెప్పారు. రాజకీయాలు ప్రజలకు సేవ చేయడానికి ఉన్న వేదిక మాత్రమేనని, దానికంటే మించినది మానవత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు వెంక?రమణతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు. ప్రజలు ఈ సేవా కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి మానవతా కార్యక్రమాలు మరెందరికీ ఆదర్శమవుతాయని అభినందించారు

## బకాయిలపై జీసీసీ కార్మికుల దీక్ష



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని జిసిసి కార్యాలయం ఎదుట ఉదయం ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మర్రి సద్దు నాయక త్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 10 మంది కార్మికులు పాల్గొని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ విధులకు హాజరుకాకుండా బహిష్క రణ చేపట్టారు. గత కొన్ని నెలలుగా జీతాలు ఆలస్యమవుతుండటం, కార్మికులకు సరిగ్గా చెల్లింపులు జరగకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.జిసిసి యాజమాన్యం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి బకాయిలు చెల్లించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

## పీఎం ఆవాస్ యోజన - ఎన్టీఆర్ హౌసింగ్ సర్వేను గడువులోగా పూర్తి చేయండి: కళ్యాణి



**జీకే వీధి, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి ఎం-ఎ వై) - ఎన్టీఆర్ హౌసింగ్ సర్వేను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పొడిగించిన డిసెంబర్ 14వ తేదీ గడువులోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా టి. ఎన్. ఎస్. ఎఫ్ (తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్) కార్యదర్శి ముక్కలి కళ్యాణి సంబంధిత అధికారులను, సిబ్బందిని కోరారు.నూతన గృహాల మంజూరు కోసం జరుగుతున్న ఈ సర్వే నిమిత్తం పంచాయతీల వారీగా నియమింపబడిన సిబ్బంది, హౌసింగ్ అధికారులు జీ.కే. వీధి మండలం పరిధిలోని 16 పంచాయతీలలో గల ప్రతి గ్రామంలో, ప్రతి ఒక్కరికీ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అలాగే, 2016 నుండి 2019 వరకు మంజూరు కాబడిన ఎన్టీఆర్ గృహాల పురోగతిపై కూడా ఆమె దృష్టి సారించారు. ఈ గృహాలు ప్రస్తుతం ఏ ఏ స్థాయిలో ఉన్నాయో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ముక్కలి కళ్యాణి అధికారులను కోరారు. ఈ చర్యల ద్వారా లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆమె సూచించారు.

# హైదరాబాద్‌లో మధ్యలో మరో భారీ ఎక్స్‌ప్రెస్ వే.. ట్రాఫిక్‌కు చెక్!



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, నగరం నడిబొడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు వేగంగా చేరుకునేలా కొత్త ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు సుమారు 10 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్ల రహదారిని నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)ను ఆదేశించింది. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీతో ప్రధాన రహదారులపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ముఖ్యంగా ఐటీ కారిడార్, కేబీఆర్ పార్కు పరిసరాలు, పాత ముంబై రోడ్డు మార్గాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో, బంజారాహిల్స్ నుంచి ఫిలింనగర్, జడ్జిస్ కాలనీ, దుర్గంచెరువు, టీ-హబ్ మీదుగా గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ వరకు ఈ ఎక్స్‌ప్రెస్ వేను నిర్మించనున్నారు. మెహదీపట్నం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించిన పీవీ ఎక్స్‌ప్రెస్ వే తరహాలోనే దీన్ని నిర్మించాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు 6-7 కిలోమీటర్ల మేర స్టీల్ బ్రిడ్జి, అవసరమైన చోట్ల అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ అధికారులు ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. సాధ్యాసాధ్యాల పరిశీలన కోసం ఇప్పటికే ఓ కన్సల్టెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆ బృందం ప్రతిపాదిత మార్గంలో క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తోంది. సర్వే పూర్తయిన వెంటనే సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఓఆర్ఆర్ నుంచి నగరంలోకి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

# విశాఖలో సీఐటీయూ పైలాన్ ఆవిష్కరణ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభల ప్రచారం వేగవంతమైంది. ఈ క్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు వై రాజు ఆధ్వర్యంలో విశాఖలోని జగదాంబ సెంటర్లో ఉన్న క్లాక్ టవర్ వద్ద సిఐటియు పైలాన్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబ ప్రధాన కార్య దర్శి కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకి ఒకసారి ఆల్ ఇండియా మహాసభలు జరుగుతాయని, అలాగే ఈ మహాసభలు మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాలకు ఆల్ ఇండియా నాయకత్వం జరగవలసిన ఉద్యమాలను తీర్మాలను చర్చించి కార్యాచరణ చేయటానికి నిర్ణయాలు జరుగుతాయని అన్నారు. ముఖ్యంగా లేబర్ కోడ్స్ వచ్చిన తర్వాత కార్మికుల జీవితం దుర్భరంగా ఏర్పడుతుందని, ఈ లేబర్ కోర్సు రద్దు చేసే వరకు పోరాడుతామని తెలియజేశారు. యువజన నాయకులు గణేష్ మాట్లాడుతూ జనవరి 4న జరగబోవు ర్యాలీలో యువకులు, కార్మికులు, నగర ప్రజలు పెద్ద మొత్తంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఈశ్వరరావు మెడికల్ రిప్రజెంట్ యూనియన్ నాయకులు చంద్రమౌళి రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు కళాధర్, తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ తలారి సత్యనారాయణ 15వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం సీఐటీయూ మున్సిపాల్, ముఠా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో కామ్రేడ్ తలారి సత్యనారాయణ 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రారంభంలో సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం టాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూఈ ప్రాంతంలో సీఐటీయూ బలోపేతానికి, మున్సిపల్, ముఠా, కాఫీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ తలారి సత్యనారాయణ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. వచ్చే రోజుల్లో పని గంటలు పెంపుదలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సత్యనారాయణ సేవలు కార్మికులకు శాశ్వత ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడగర్ల రాజు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్. గౌరి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డి. శివ, మున్సిపల్ కార్మిక నాయకులు ఎం. బాబారావు, వి. రమణ, చిన్న, శివ, ముఠా కార్మిక నాయకులు సాంబ తదితరులు పాల్గొన్నారు.

# కోతలతో జీతాలు చెల్లించడం దుర్మార్గం.. ఉక్కు పరిపాలన భవనం వద్ద సీఐటీయూ ధర్నా




**గాజువాక, పతాకం న్యూస్:** దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన సర్కులర్ను బలపరుస్తూ స్టీల్ యాజమాన్యం కార్మికులకు కోతలతో జీతాలు చెల్లించడం దుర్మార్గమని స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తీవ్రంగా ఖండించారు. బుధవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్ కార్మికులకు అన్యాయం చేస్తూ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలకు తక్షణం ఉపసంహరించుకోవాలని, కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ఏ చెల్లించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని, ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామన్న సర్కులర్ను తక్షణం ఉపసంహరించుకోవాలని, బకాయి పడిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె అయోధ్య రామ్ మాట్లాడుతూ కార్మికులకు జీతాలు కోతలు విధించి యాజమాన్యం పైశాచిక ఆనందం పొందుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇచ్చిన ఇటువంటి సర్కులర్ను ఉపసంహరించుకోవాలని లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయంతో అధర్మంగా అమలు చేయడం దుర్మార్గమని ఆయన వివరించారు. ఇప్పటికే గడచిన సంవత్సర కాలంగా హెచ్ఆర్ఏ లేదని అలాగే ఉక్కునగరంలో నివసిస్తున్న కార్మికులకు విద్యుత్ చార్జీలు పెంచుతూ ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉన్నారని ఇప్పటికైనా యాజమాన్యం తన వైఖరిని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు యు రామస్వామి మాట్లాడుతూ రా మెటీరియల్ అందుబాటులో ఉంటే పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి కార్మికుల సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. అందులో భాగంగానే 30 వ తారీఖున 20,400 స్టీల్ ఉత్పత్తి చేసింది ఈ కార్మిక వర్గం కాదా అని ఆయన ప్రశ్నించారు. నిన్న రాత్రి పవర్ లేక ఎస్ టి ఏం మిల్ ఆగడం వాస్తవం కాదా అని ఆయన అన్నారు.

# నర్సీపట్నంలో 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ అయ్యన్న అండతోనే కబ్జా?: ఉమాశంకర్ గణేష్ ఆరోపణ



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం ప్రభుత్వ భూములపై జరుగుతున్న భారీ అక్రమాలపై మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సీపట్నంలో సుమారు 15 కోట్ల విలువ చేసే భూమిని కొంతమంది వ్యక్తులు అయ్యన్న అండతోనే కబ్జా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా జరుగుతున్న సోలార్ ప్లాంట్ నిర్మాణాన్ని గణేష్ తన కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. నర్సీపట్నం మున్సిపాలిటీలోని బలిఘట్టం ప్రాంతంలో అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన సర్వే నంబర్ 647లో 18 ఎకరాలు, సర్వే నంబర్ 648లో 12 ఎకరాలు 20 సెంట్లు, మొత్తం 30 ఎకరాలు 20 సెంట్లు భూమి ఉందని తెలుసుకున్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా స్థానిక రైతులు ఆ భూములను దేవాదాయ శాఖ నుంచే లీజుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ, లీజు రుసుమును ప్రభుత్వం కు చెల్లిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ వ్యవసాయ భూములను ఇప్పటివరకు దేవాదాయ శాఖే వేలం పాట పద్ధతిలో రైతులకు ఇవ్వడం జరిగేదని, అక్కడ ఆగాకరకాయ, బీరకాయ వంటి పంటలు పండించేవారని గణేష్ తెలిపారు. అయితే ఇదే విషయాన్ని గమనించిన కొంతమంది అధికార పార్టీ నాయకులు, ప్రముఖ ఆర్థిక స్థోమత కలిగిన వ్యక్తులు ఆ భూములను కబ్జా చేసేందుకు పన్నాగాలు పన్నారు. గత రెండు నెలలుగా ఇనుపరాడ్లు పాతి సోలార్ ప్లేట్లు అమర్చేందుకు ఏర్పాట్లు చేయడం, ఆర్థిక లావాదేవీలు జరపడానికి ప్రయత్నించడం జరిగినట్లు ఆయన ఆరోపించారు. సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించినా ఎండోమెంట్ శాఖ కనీసం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది అని గణేష్ అన్నారు. ఎటువంటి హక్కు లేకుండా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని వ్యాపార ప్రయోజనాల కోసం పనులు కొనసాగించడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమాలపై సంబంధిత వ్యక్తులు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లును రద్దు చేయాలి



**మన్యం జిల్లా, పతాకం న్యూస్:** లేబర్ కోడ్ లును రద్దు చేయాలని విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిఎంవలస మండలం ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా మహాసభలు వాల్ పోస్టర్ విడుదల చేస్తూ సంఘం మండల కార్యదర్శి పోల సింహాచలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న లేబర్ కోడ్లు కార్మికులను బానిసలుగా మార్చేవిగా ఉన్నాయని సంఘం పెట్టుకునే హక్కు , సమ్మె చేసే హక్కు, కనీస వేతన చట్టం అన్ని హక్కులు కాలరాస్తున్నాయని అన్నారు. చిరు ఉద్యోగులకు భద్రత కరువైందని రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఉపాధి హామీని పగడ్బందీగా అమలు చేసి అందరికీ పనులు కల్పించాలని చెప్పారు. అలాగే విశాఖపట్నంలో జరుగుతున్న ఆల్ ఇండియా మహాసభలకు అన్ని రంగాల కార్మికులు జనవరి 4వ తేదీన బహిరంగ సభకు వచ్చి మహాసభలను జయప్రదం చేయాలని, కార్మికుల హక్కులు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిఎంవలస ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# తురకలపూడి రామాలయానికి 200 సిమెంటు బస్తాలు అందజేత

**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలోని తురకలపూడి గ్రామంలో గ్రామ పెద్దలు దాతలు సహకారం తో నిర్మిస్తున్న రామాలయం కు గ్రామానికి చెందిన దేవ పూజా గున్న 200 సిమెంటు బస్తాలు అందజేశారు. విశాఖ లో స్తిర పడ్డ దేవ పూజా గ్రామ పెద్దలు రామాలయం కు సహాయం అడగగా 200 సిమెంటు బస్తాలు అందించి తన భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కోరుకొండ అప్పలనాయుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ కోరుకొండ రవి, మాజీ సర్పంచ్ గంటల అప్పలనాయుడు, ఉల్లింగల రాజారావు, మాజీ పి. ఏ. సి. ఎస్ అధ్యక్షుడు బుదిరెడ్డి భూషణం, గంటల నరేశ్ గంటల శేషు మంత్రి వెంకి నాయుడు వైదేహి సత్తిరాజు కోరుకొండ రమణ పాల్గొన్నారు.

# భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి: శ్రీను



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్:** ఆదివాసి సంక్షేమ పరిషత్ అడ్డతీగల మరియు రాజవొమ్మంగి మండల కార్యకర్తల సమావేశం తిమ్మాపురం గ్రామంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ అడ్డతీగల మరియు రాజవొమ్మంగి మండల పరిధిలో ఆదివాసి భూములు విచ్చలవిడిగా కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. ఆదివాసుల నుండి తమ సంఘానికి భారీ ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని మైదాన ప్రాంతాల నుండి ఏజెన్సీ ప్రాంతాలకు వలసలు వస్తున్న నాన్ ట్రైబల్స్ ఆదివాసి భూములను కబ్జా చేసి ఆదివాసులను భయభ్రాంతులకు గురి చేస్తూ తప్పుడు మార్గంలో పట్టాలు చేసుకుంటున్నారని అన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో అసలు రెవెన్యూ అధికారులు నాన్ ట్రైబల్స్ కి పట్టాలు ఏ విధంగా మంజూరు చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల కొరకు చేస్తున్న భూ సేకరణ లో పూర్వ నుంచి ఆదివాసి సాగులో ఉన్న భూములను నాన్ ట్రైబల్స్ తప్పుడు మార్గంలో పట్టాలు చేయించుకొని పోలవరం నిర్వాసితుల కొరకు కొనసాగుతున్న భూసేకరణలో అమ్మకానికి పెడుతున్నారని ఆయన ఆరోపించారు. 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో భూ బద్దలాయింపులు నిషేధమన్నారు. ఆదివాసి భూములు కబ్జా చేసుకుని పోలవరం భూసేకరణకు అమ్ముకుంటున్న నాన్ ట్రైబల్స్ పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, అడ్డతీగల మండల అధ్యక్షురాలు కారు అరుణ కుమారి. అడ్డతీగల, రాజవొమ్మంగి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్దబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన సూర్యచంద్ర తన సొంత నిధులతో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం జనసేన చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. చదువు భవిష్యత్తు నిర్మాణానికి పునాది అని పేర్కొంటూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచి స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో జనసేన ఎల్లప్పుడూ సహాయం అందిస్తుందని సూర్యచంద్ర అన్నారు. సరైన మార్గదర్శకత్వం, అవసరమైన పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ అందితే విద్యార్థులు పెద్ద స్థాయిలో రాణించగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, అలివేలు మంగ, వెంకటేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ వాసురాజు ఇతరులతో కలిసి పాల్గొన్నారు.

# కొయ్యూరు నూతన డిప్యూటీ ఎంపీడీవోగా టి. శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్ల,కొయ్యూరు మండలానికి నూతన డిప్యూటీ ఎంపీడీవోగా టి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడమే తన ధ్యేయమని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామ సచివాలయాల పర్యవేక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, సమస్యలను సమయానుసారం పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# కస్టమర్ కేర్ పేరుతో సైబర్ మోసం - జాగ్రత్తలు పాటించకుంటే బ్యాంక్ ఖాతాలు ఖాళీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** గృహోపకరణాలు మరమ్మతులకు గురైతే క్షణం ఆలోచించకుండా గూగుల్‌లో తయారీ సంస్థ కస్టమర్ కేర్ నంబరును వెతికేస్తున్నారా! అక్కడ ప్రముఖంగా కనిపించే నంబరుకు కాల్ చేస్తున్నారా! అయితే అందులోనివి అన్నీ అసలైనవి కాదంటున్నారు నిపుణులు. కనిపించేవన్నీ కస్టమర్ కేర్ నంబర్లు కాదు!: ఈ విషయం ఏ మాత్రం తెలియక ఫోన్ చేయగానే పలకరించే అవతలి వ్యక్తులు నిజమైన కస్టమర్ కేర్ ప్రతినిధులని పొరబడితే సర్వీసు పొందేందుకు పంపే లింకు క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే మీరు మోసపోతారని హెచ్చరిస్తున్నారు. లింకులను క్లిక్ చేసిన క్షణాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు నకిలీ కస్టమర్ కేర్ నంబర్లను అందుబాటులో ఉంచుతున్నట్లు ఈ సందర్భంగా తెలియజేస్తున్నారు. అనుకోకుండా మోసపోతే: దురదృష్టవశాత్తు మీరు సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించండి. ఈ విధంగా ఫిర్యాదు చేసిన అనంతరం పోగొట్టుకున్న డబ్బును వెంటనే రికవరీ చేయడానికి చాలావరకూ సాధ్యపడుతుంది.

# శిథిలావస్థలో ఉన్న అక్కుపలి తుఫాన్ రక్షిత భవనం



**వజ్రపుకొత్తూరు, పతాకం న్యూస్:** మండలంలోని అక్కు పల్లి తుపాన్ రక్షిత భవనం శిథిలావస్థకు చేరుకొంది. 15 ఏళ్ల కిందట ఎన్‌సీఆర్‌ఎంపీ నిధులతో నిర్మించిన ఈ భవనం నిర్వహణ లోపం వల్ల మరమ్మతులు లేక తలుపులు ఊడిపోవడంతోపాటు, గోడలు బీటలు వారాయి. శ్లాబు పెచ్చులూడుతుండడంతో భవనాన్ని అధికారులు మూసి వేశారు. తుఫాన్లు, ప్రకృతివైపరీత్యాల సమయంలో గ్రామంలో నివసి స్తున్న 1,500 మందికి షెల్టర్‌కోసం నిర్మించారు. తీరానికి అరకిలోమీటరు దూరంలోఉన్న ఈగ్రామం తుఫాన్ ప్రభావితగ్రామాల జాబితాలో ఉంది. ఇక్కడ భవనం శిథిలావస్థకు చేరడంతో తుఫాన్ల సమయంలో బైపల్లిలోని మల్టీపర్పస్ భవనంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాల్సివస్తోంది. దీనికితోడుఅక్కుపల్లి తుపాన్ రక్షిత భవనం ఇక్కడి ఉన్నత పాఠశాల మైదానం మధ్యలో నిర్మించారు.పాఠశాల విద్యార్థులు ఆడుకునే సమయం లో అటుగా భవనంలోకి వెళ్లే ప్రమాదాలు జరుగుతాయోనని తల్లిదం డ్రులు ఆందోళనచెందుతున్నారు. గ్రామసచివాలయం కూడా తుఫాన్ షెల్టర్‌కు ఆనుకునేఉంది. సిబ్బందితోపాటు కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే వారంతా శిథిలావస్థకు చేరిన భవనం చూసి ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈతుఫాన్ షెల్టర్‌లోనే గతంలో ఉన్నతపాఠశాల తరగ తులతోపాటు పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని కూడానిర్వహించిన విషయం విదితమే. తక్షణమే అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పుతిన్ భారత పర్యటన.. ఢిల్లీలో డ్రోన్లు, స్నైపర్లు, ఏఐతో పటిష్ఠ నిఘా






**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సర్వం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ఆయన రేపు సాయంత్రం ఢిల్లీ చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో అపూర్వమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పుతిన్‌కు ఐదంచెల అభేద్యమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భద్రతలో రష్యా అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పాటు, భారత నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) కమాండోలు, స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానిటరింగ్ వ్యవస్థలను మోహరించారు. సమాచారం ప్రకారం, ఇప్పటికే రష్యాకు చెందిన 48 మంది ఉన్నత స్థాయి భద్రతా సిబ్బంది ఢిల్లీకి చేరుకున్నారు. వారు ఢిల్లీ పోలీసులు, ఎన్ఎస్‌జీ అధికారులతో కలిసి పుతిన్ ప్రయాణించే అన్ని మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పుతిన్ భద్రతలో బయటి వలయాల్లో ఎన్ఎస్‌జీ, ఢిల్లీ పోలీసులు ఉండగా, అంతర్గత వలయాల బాధ్యతను రష్యా అధ్యక్ష భద్రతా దళాలు చూసుకుంటాయి. ప్రధాని మోదీతో ఉన్నప్పుడు, భారత స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమాండోలు కూడా ఈ భద్రతలో పాలుపంచుకుంటారు. ఈ పర్యటనలో మరో ప్రత్యేక ఆకర్షణ పుతిన్ వాడే 'అరస్ సెనాట్' అనే అత్యంత సురక్షితమైన లగ్జరీ కారు. దీనిని ప్రత్యేకంగా మాస్కో నుంచి భారత్‌కు తీసుకువస్తున్నారు. 'చక్రాలపై నడిచే కోట'గా పిలిచే ఈ కారు పూర్తి ఆర్మర్డ్ వాహనం. పుతిన్ బస చేసే హోటల్‌తో పాటు ఆయన పర్యటించే రాజ్‌ఘాట్, హైదరాబాద్ హౌస్, భారత్ మండపం వంటి అన్ని ప్రదేశాలను భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

# పదేళ్లుగా టిడ్కో లబ్ధిదారుల ఎదురుచూపులు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** టిడ్కో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు..గత పదేళ్లగా పేదింట కల గంటూనే ఉన్నారు. అయినా నేటికీ కల తీర లేదు..ఇల్లు రాలేదు.గత టీడీపీ హయాంలో నిర్మిం చిన టిడ్కో గృహాలను నిర్మించినా.. వైసీపీ నిర్లక్ష్యం కారణంగా పేదలకు ఇళ్లు అందలేదు. పేదల కనీస అవసరమైన ఇంటి కలను నెరవేర్చడానికి 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను నిర్మించిన సంగతి తెలిసిందే. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ అధికా రంలోకి రావడంతో ప్రజల గూడుకు చీడ పట్టింది. ఈనాటికి లబ్ధిదారులకు దక్కకుండా వృథాగా పడి ఉన్నాయి.మొదట్లో టీడీపీ ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో కొంత మందిని వైసీపీ మార్చేసింది.రుణాలు సరిగ్గా ఇప్పించలేదు.ప్రస్తుతం కూట మి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఇటీవల కదలిక వచ్చింది. టిడ్కో ఇళ్లను డిసెంబర్ చివరికి లబ్ధిదా రులకు అప్పగించేలా ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది.అయితే ఈ సారైనా ఇస్తారా లేదా అనే మీమాంసలో లబ్ధిదారులు ఉన్నారు. సీఎం చంద్రబాబు తమ గోడు విని గూడు కల్పిం చాలని డిమాండ్ చేస్తున్నారు. నేడు సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టిడ్కో గృహాలు ఎప్పుడిచ్చేది తేల్చాలని కోరుతున్నారు.

రాజమహేంద్రవరంలో ఏడు ప్రాజెక్టుల కింద 6304 టిడ్కో ఇళ్లు నిర్మించారు. అందులో 5,574 మందికి రిజి స్ట్రేషన్లు పూర్తయ్యాయి.ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి.కానీ మౌలిక సదుపాయాల్లేకపోవడంతో ఇళ్లలో ఉన్నది మాత్రం చాలా తక్కువ మంది. చాలా ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. బొమ్మూరులో మొదటి దశలో 2528 ఇళ్లు నిర్మించారు. తొర్రేడులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవళే శ్వరంలోని వడ్డెర కాలనీలో 256 నిర్మించారు.బొమ్మూరు నిర్మించిన ఇళ్లలో 2528 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా 1977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు.బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు. అక్కడ ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాల్సి ఉంది. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చారు. ధవళేశ్వరం( వడ్డెర కాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్పగిం చారు. మోరంపూడి డి.బ్లాక్‌లో 224 ఇళ్లు అప్పగించినా కనీస సౌకర్యాలు లేక కేవలం 15 మంది మాత్రమే ఉం టున్నారు. రెండో దశలో నామవరంలో 1104 ఇళ్లు, సిం హాచలనగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1100 నిర్మించారు.ఇవి ఇంకా పూర్తి కాలేదు. మౌలిక సదు పా యాలు కల్పించలేదు. బొమ్మూరు ఫేజ్-2, నామవరం టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు.బొమ్మూరులో ఇళ్లను డిసెంబర్ చివరినాటికి లబ్ధిదా రులకు అప్ప గిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతు న్నారు.నామవరంలో చెట్లు తొలగించిన తర్వాత పనులు ఆరంభమ వుతాయి.డిసెంబర్ నాటికి పూర్తి చేసి లబ్ధిదా రులకు ఇచ్చేస్తామని అధికారులు చెబుతున్నారు. నిడదవోలులో 1755 మంజూరు కాగా 1248 ఎంపిక చేసి 1152 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లబ్ధిదా రుల ఎం పిక కూడా పూర్తిగా జరగలేదు.ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. కొవ్వూరు పరిధిలో పేదలకు 480 ఇళ్లు మంజూరు కాగా 480 మొదలు పెట్టారు. ఇళ్ల నిర్మాణం జరిగినా మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో మొత్తం పెండింగ్‌లో పడింది. ఇక్కడ పనులు ఆపేసిన కాంట్రాక్టరును రద్దు చేసి కొత్త కాంట్రాక్టరు పనులు అప్పగించాలనే ఆలోచనతో ఉన్నారు. కొవ్వూరు, నిడద వోలు టిడ్కో ఇళ్లు 2026లోనే ఇవి లబ్ధిదారులకు అందే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# విశాఖ సమ్మిట్‌లో కార్మికుల సంక్షేమంపై చర్చించండి

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాబోయే ఐదేళ్లలో ఆర్టీసీ బస్సులన్నింటినీ ఈవీలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. దీనికి అనుబంధంగా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయంలో విద్యుత్ శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలోని ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ. 1,053 కోట్ల భారం పడనుంది. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కీలకమైన ఈ పరిశ్రమలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల (పీఎస్పీ) ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని, ఇందుకు జెన్‌కో, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. రాష్ట్రాన్ని ఒక 'న్యూ ఎనర్జీ హబ్'గా మార్చాలని ఆకాంక్షించిన చంద్రబాబు, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐస్) పాలసీ కింద ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు 60 రోజుల్లోనే తమ పనులను ప్రారంభించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో 'పవర్ స్వాపింగ్' ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు.




గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని చంద్రబాబు విమర్శించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) రద్దు నిర్ణయంతో ప్రజలపై రూ. 9 వేల కోట్ల భారం పడిందని, విద్యుత్‌ను వినియోగించుకోకుండానే కంపెనీలకు ఆ ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సమర్థ నిర్వహణ ద్వారా విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే ఆ భారాన్ని సున్నాకు తగ్గించగలిగామని వివరించారు.

# పల్నాడు జిల్లాలో 'స్క్రబ్ టైఫస్ కలకలం.. ఇద్దరు మృతి

**పల్నాడు జిల్లా, పతాకం న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో స్క్రబ్ టైఫస్ వ్యాధి హడలెత్తిస్తుంది. ఇప్పటికే విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం మెట్టపల్లికి చెందిన ఓ మహిళ ఈ వ్యాధి లక్షణాలతో ప్రాణాలు కోల్పోయారు. నెల్లూరు జిల్లాలో 4 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు, కడప, మన్యం జిల్లాల్లోనూ కేసులు నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కీటకం లక్షణాలు కలకలం రేపుతున్నాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలో స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ఇద్దరు మృతి చెందగా మరో మహిళ ప్రస్తుతం చికిత్స పొందుతోంది. నెలరోజుల వ్యవధిలో జర్వం, ఒంటినొప్పులతో ఆస్పత్రిలో చేరి ఇద్దరు మృతి చెందడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే రాజుపాలెం మండలం కొత్తూరులో స్క్రబ్ టైఫస్ లక్షణాలతో సాలమ్మ (72) అనే వృద్ధురాలు ప్రస్తుతం చికిత్స పొందుతోంది. విద్యార్థిని మృతి : రాజుపాలెం మండలం ఆర్‌ఆర్ సెంటర్‌కు చెందిన నాగమ్మ (62), ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోతి మృతి చెందారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థినికి చిన్న కీటకం కాటేసింది. తొలుత జ్వరం, ఒంటినొప్పులు వచ్చాయి. జీర్ణకోశ సమస్యలు తలెత్తాయి. సాధారణ జ్వరం, అనారోగ్య సమస్య అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారింది. జ్వరం ప్రబలిన వారం రోజుల తర్వాత కీటకం కాటేసిన జాడ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షలో వెల్లడైంది. అప్పటికే నష్టం జరిగిపోయి ఇంటర్ విద్యార్థిని మృత్యువాత పడింది. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్. గత కొన్నేళ్లుగా జిల్లాలో తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా దీని బారినపడి ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు సమగ్రాసుపత్రిలో ప్రయోగశాల ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు.




అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమునాలు పంపితే నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. ఇది మనుషుల నుంచి మనుషులకు వ్యాపించదని వివరించారు. నిర్ధారణ నుంచి చికిత్స వరకు జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ఔషధాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా స్క్రబ్ టైఫస్ దరిచేరకుండా చూసుకోవచ్చన్నారు.

# తరచూ నోటి పుండ్లతో బాధపడుతున్నారా?

విటమిన్ లోపం, ఒత్తిడి, నిద్రలేమి, నెలసరి సమయంలో హార్మోన్లలో వచ్చే మార్పులు, వివిధ రకాల వైరల్-బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు ఇవన్నీ చాలా మందిలో నోటి అల్సర్లకు కారణమవుతుంటాయి. కొందరిలో ఒంట్లో వేడి చేయడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తుతుంది. ఇలా కారణమేదైనా నోటి అల్సర్ల వల్ల విపరీతమైన నొప్పితో పాటు కనీసం నీరు కూడా తాగడానికి కూడా ఇబ్బంది పడుతుంటాం. అయితే ఈ సమస్యకు మన వంటింట్లోనే పరిష్కారం ఉందని నిపుణులు చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! తులసి మొక్కతో ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలున్నాయి. వివిధ రకాల అలర్జీలను తగ్గించడంలో ఈ ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇందులో నోటి అల్సర్లను తగ్గించే లక్షణం కూడా ఉందంటున్నారు నిపుణులు. రోజుకు నాలుగైదు సార్లు కొన్ని తులసి ఆకులను నమలడం వల్ల సులభంగా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు. ఈ ఆకులను నమిలేటప్పుడు వాటికి కొన్ని నీళ్లు కూడా జత చేస్తే, ఆ ద్రావణం నోరంతా వ్యాపించి, సమస్యను త్వరగా తగ్గిపోతుందని సూచిస్తున్నారు. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్, యాంటీ-ఆక్సిడెంట్, ఇమ్యునో-మాడ్యులేటరీ లక్షణాల కారణంగా, తులసి వివిధ నోటి రుగ్మతల చికిత్సలో ఆశాజనకమైన మూలికగా ఉంటుందని ప్రచురించింది. ఆహార పదార్థాలకు అదనపు రుచిని తేవడం, చర్మంపై గాయాలను మాన్పడమే కాకుండా నోటి అల్సర్లను తగ్గించడంలోనూ తేనె సమర్థంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అల్సర్ల సమస్య ఎక్కువగా ఉన్నచోట తేనెను రాస్తే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు. ఇందులోని యాంటీమైక్రోబియల్ గుణాల కారణంగా అల్సర్లను కలిగించే బ్యాక్టీరియా త్వరగా నశిస్తుందని పేర్కొంటున్నారు. తేనెలోని



సహజగుణాలు నోటి లోపల తేమ ఉండేలా చేసి, అల్సర్ల వల్ల పొడిబారిన చర్మానికి ఉపశమనాన్ని కలిగిస్తాయని తెలియజేస్తున్నారు. తేనెను ఉపయోగించి, అల్సర్ల నుంచి మరింత త్వరిత ఉపశమనం పొందాలంటే, దానికి చిటికెడు పసుపు కలిపితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆఫ్తస్ నోటి పూతలతో బాధపడుతున్న పిల్లల సమూహంలో తేనె ప్రభావవంతమైన, సురక్షితమైన చికిత్సా ఏజెంట్‌గా కనుగొనబడిందని ప్రచురించింది. ప్రకృతిసిద్ధంగా ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో కొబ్బరిది కీలకస్థానం. నోటి అల్సర్లతో బాధపడేవారు సమస్య ఉన్న చోట కాస్త కొబ్బరి నూనెను రాస్తే ఉపశమనాన్ని పొందచ్చంటున్నారు నిపుణులు. అలాగే ఎండుకొబ్బరి ముక్కలను నమిలినా, అల్సర్ల నుంచి త్వరగా ఉపశమనం పొందచ్చని చెబుతున్నారు. ఇక లేత కొబ్బరిబోండం నీళ్లు ఎక్కువసార్లు తీసుకోవడం వల్ల శరీరంలోని వేడి తగ్గి, అల్సర్ల సమస్య క్రమంగా తగ్గుముఖం పడుతుందని పేర్కొంటున్నారు. శరీరంలోని వేడిని తగ్గించడంలో గసగసాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. నోట్లో అల్సర్లు ఇబ్బంది పెట్టడానికి అధిక వేడే కారణమంటున్నారు నిపుణులు. అందుకే ఈ సమస్యను తగ్గించుకోవడానికి గసగసాలు చక్కటి ప్రత్యామ్నాయం అని సూచిస్తున్నారు. ఒక టేబుల్ స్పూన్ పొడిచేసిన గసగసాలకు, అంతే పరిమాణంలో పంచదారను జతచేసి, సమస్య తగ్గే వరకు రోజూ రెండు లేదా మూడు సార్లు తీసుకుంటే ఫలితం ఉంటుందని తెలియజేస్తున్నారు. నోటి అల్సర్ల నుంచి తక్షణ ఉపశమనానికి సమస్య ఉన్న చోట ఐస్ ముక్కలతో మర్దన చేస్తే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

అల్సర్‌తో ఇబ్బంది పడుతున్నవారు తరచూ లవంగాలు నమిలితే, ఆ ఘాటుకు సమస్య సులభంగా పరిష్కారమవుతుందంటున్నారు. దీనికి బదులు లవంగం నూనెను కూడా సమస్య ఉన్న చోట అప్లై చేయచ్చని సూచిస్తున్నారు. అలాగే, గోరువెచ్చని నీటితో నోటిని వీల్కైనన్ని ఎక్కువసార్లు పుక్కిలించాలని సలహా ఇస్తున్నారు. ఇలా చేస్తే అల్సర్ల కారణంగా ఎదురయ్యే మంట, నొప్పి నుంచి తక్షణ ఉపశమనం పొందచ్చని పేర్కొంటున్నారు. మజ్జిగను ఎక్కువగా తీసుకుంటే నోటి అల్సర్ల సమస్యను సులభంగా తగ్గించుకోవచ్చని అంటున్నారు. లేకపోతే సమస్య ఉన్నచోట నెయ్యిని రాసినా మంచి ఫలితాన్ని పొందవచ్చని తెలియజేస్తున్నారు. ఏదైనా ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవాలని, లేదంటే నోట్లో మిగిలిపోయిన ఆహారపదార్థాల నుంచి వెలువడే ఆమ్లాలు నోటి అల్సర్ల సమస్యకు కారణమవుతాయని చెబుతున్నారు. రోజుకు కనీసం రెండుసార్లు పళ్లు తోముకోవడం, రోజుకు ఒకసారి ఫ్లాస్ చేసుకోవాలని అధ్యయనం పేర్కొంది.

అలాగే, ప్రతి మూడు నెలలకోసారి టూత్‌బ్రష్‌ను మార్చడం వల్ల నోటి అల్సర్ల సమస్య రాకుండా జాగ్రత్తపడచ్చని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా శరీరంలో 'విటమిన్ బి12' శాతం తగ్గిపోతే నోటి అల్సర్లు వస్తాయని, కాబట్టి డాక్టర్ల సలహా మేరకు విటమిన్ బి12 సప్లిమెంట్స్ వేసుకోవడం, ఈ విటమిన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు.' విటమిన్ సి' పుష్కలంగా లభించే వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఇలాంటి అల్సర్లకు చెక్ పెట్టచ్చని అంటున్నారు. నోటి అల్సర్ల సమస్యతో బాధపడుతున్నప్పుడు టీ, కాఫీలకు ఎంత దూరంగా ఉంటే అంత మేలని సలహా ఇస్తున్నారు.

# మొటిమలు ఇబ్బంది పెడుతున్నాయా?



మొటిమలు.. అమ్మాయిలు, అబ్బాయిలను సౌందర్యపరంగా ఇబ్బందిపెట్టే సమస్యల్లో ఇది ఫస్ట్ ప్లేస్‌లో ఉంటుంది. కాలుష్యం, శరీరంలో వేడి, అధిక సెబమ్ విడదల కావడం, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపాలు, జన్యుపరమైన సమస్యలు వంటి కారణాల వల్ల మొటిమల సమస్య వేధిస్తూ ఉంటుంది. మొటిమల కారణంగా నొప్పి, వాపు కూడా బాధపెడుతూ ఉంటాయి. మొటిమలు, మొటిమల కారణంగా వచ్చే మచ్చలు, గుంతలు మన ముఖాన్ని అందవిహీనంగా మారుస్తాయి. మొటిమలు వచ్చిన తర్వాత.. రకరకాల రెమీడీస్‌తో వాటిమీద పోరడటం చేయడం కంటే.. అవి రాకుండా జాగ్రత్తపడటం చాలా మంచిది. మొటిమల సమస్యను శాశ్వతంగా దూరం చేయాలంటే.. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి. ప్రతి రోజు సరిపడా నీళ్లు తాగితే.. శరీరంల హైడ్రేటెడ్‌గా ఉంటుంది. మనం నీరు ఎక్కువగా తాగితే.. శరీరంలోని పేగులు, ఇతర అవయవాలు శుభ్రపడతాయి. అదేవిధంగా, చర్మంలోని మురికి, కాలుష్యం, టాక్సిన్స్ క్లీన్ అవుతాయి. దీంతో, పింపుల్స్ సమస్య పరిష్కారం అవుతుంది. నీరు ఎక్కువగా తాగడం వల్ల చర్మంలోని మృతకణాలు తొలగిపోయి చర్మం తాజాగా, ప్రకాశవంతంగా మారుతుంది. రోజూ కనీసం ఏడెనిమిది గ్లాసుల నీరు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. మీ డైట్‌లోనూ.. సూప్‌లు, జ్యూస్‌లు వంటి ద్రవపదార్థఆలు ఎక్కువగా చేర్చుకోవడం మంచిది.

మీ చర్మాన్ని క్రమం తప్పకుండా ఎక్స్‌ఫోలియేట్ చేయడం మర్చిపోవద్దు. ఎక్స్‌ఫోలియేషన్ వల్ల చర్మ రంధ్రాల లోపల పేరుకున్న వ్యర్థాలు, కాలుష్య కారకాలను బయటకు పంపవచ్చు. మొటిమలు, నల్ల మచ్చలు వంటి చర్మ సమస్యలను నివారించవచ్చు. ఎక్స్‌ఫోలియేషన్ చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తుంది, కొత్త చర్మ కణాల ఏర్పాటును ప్రోత్సహిస్తుంది, రక్తప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. మీ చర్మం తాజాగా, మెరుస్తూ ఉండటానికి కనీసం వారానికి ఒకసారైనా.. న్యాచురల్ స్క్రబ్‌తో చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయండి. ఇది మొటిమలనే కాదు.. ఇతర చర్మ సమస్యలను దూరం చేస్తుంది. మీ అందాన్ని రెట్టింపు చేయడానికి, మొటిమల సమస్యను నివారించడానికి మీరు తీసుకునే డైట్ సహాయపడుతుంది. మీ ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, నట్స్ ఎక్కువగా తీసుకోండి. నట్స్‌లో యాంటీ-ఏజింగ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అంతేకాదు వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఎ, ఇ, విటమిన్లు, ఒమేగా- 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. స్వీట్స్, జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, కూల్ డ్రింక్స్ తీసుకోకపోవడం మంచిది. ఇవి చర్మ సమస్యలను ప్రేరేపిస్తాయి. మనం ఆరోగ్యంగా ఉండటానికే కాదు.. మన అందాన్ని రెట్టింపు చేయడానికి వ్యాయామం సహాయపడుతుంది. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల హైపర్‌టెన్షన్, అధిక బరువు, ఒత్తిడి, చర్మ సమస్యలు దూరం అవుతాయి. ఒత్తడి, ఊబకాయం వల్ల వచ్చే.. మొటిమలను వ్యాయమంతో అదుపులో ఉంచుకోవచ్చు.

ఎక్సఅర్‌సైజ్ చేయడం వల్ల మన శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. శరీరంలోని వ్యర్థాలు తొలగుతాయి. మన ఆరోగ్యానికి నిద్ర చాలా ముఖ్యం. నిద్ర చక్రంలో ఆటంకం ఏర్పడితే.. మన శరీర విధులు, కదలికలపై ప్రభావం పడుతుంది. రోజుకు కనీసం ఏడెనిమిది గంటల నిద్ర తప్పనిసరి. నిద్రలేమి విపరీతమైన ఒత్తిడి, ఆందోళనతోపాటు ఇతర సమస్యలకూ దారి తీస్తుంది. ఒత్తిడి పెరిగినప్పుడు సహజంగానే.. మొటిమలు రావడం స్టార్ట్ అవుతాయి. నిద్ర సరిగ్గా లేకపోతే.. త్వరగా వృద్ధాప్య ఛాయలు రావడం, కళ్లకింద వాపులు వంటి సమస్యలు కూడాఎదురవుతాయి. ఈ సమస్యలను నివారించడానికి ప్రశాంతంగా నిద్రపోవాలి.

# గంజాయి ఖైదీలతో కిక్కిరిసిన విశాఖ కేంద్ర కారాగారం

## జైలు వాస్తవ సామర్థ్యం 914 మంది.. కాని 1,100 మంది వరకూ ఉన్నారు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గంజాయి ఖైదీలతో విశాఖలోని కేంద్ర కారాగారం కిక్కిరిసింది. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిలో శిక్షపడిన వారు, విచారణ ఖైదీలు ఈ కారాగారంలో 1,100 మంది వరకూ ఉన్నారు. ఈ జైలు వాస్తవ సామర్థ్యం 914 మందేనని జైలు సూపరింటెండెంట్ ఒబ అంతకుమించి ఇక్కడ గంజాయి ఖైదీలే ఉన్నారు. మిగతా ఖైదీలు సుమారు 400 మంది ఉన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణాకు అడ్డాగా విశాఖ మారింది. చాక్‌లెట్స్, టాబ్లెట్ రూపంలో వీటి అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గంజాయి మత్తుకు యువత ఎక్కువగా బానిసవుతోంది. గంజాయిని, డ్రగ్స్‌ని బైకులపైనా, కారుల్లోనూ, బస్సుల్లో బ్యాగుల్లోనూ తీసుకొస్తూ పట్టుబడిన వారిలో యువకులే అధికంగా ఉంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన పలువురు ఈ స్మగ్లింగ్‌లో నిందితులుగా ఉన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్ వ్యాపారాల తనిఖీకి రాష్ట్రంలోనే అత్యధిక నెట్‌వర్క్ విశాఖలో ఉంది. 21 డాగ్‌స్క్వాడ్స్, ప్రత్యేక బృందాలు ఉన్నప్పటికీ అదుపులో పురోగతి కానరావడం లేదు. గంజాయి, డ్రగ్స్ అక్రమార్కులు ప్రభుత్వం, పోలీసుల ఎత్తుకు పైఎత్తులు వేస్తూ తమ అక్రమ రవాణాను ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు విస్తరించారు. రవాణాదారులు, వినియోగదారులే పట్టుబడుతు న్నారు. తయారీదారులు, సరఫరాదారుల వివరాలు బయటకు రావడం లేదు. గంజాయి మాఫియా కొంతమంది నిరుద్యోగ యువతను తమ వ్యాపారానికి సాధనంగా ఎంచుకుని యథేచ్ఛగా తన వ్యాపారాన్ని కొనసాగిస్తోంది. యువతను టార్గెట్ చేసి సరఫరా చేస్తోంది. వారితో అమ్మిస్తోంది.

విశాఖ నగరంలోని కొన్ని యూనివర్సిటీలు, కొన్ని ప్రముఖ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు బానిసైనట్లు పోలీసు ఉన్నతాధికారులే బహిరంగంగా వెల్లడించారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా అవుతోంది. రోడ్డు ప్రమాదాలు, హత్యలు, దాడులు, అశ్లీల వ్యవహారాలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు వంటివి గంజాయి, డ్రగ్స్ మత్తులోనే జరుగుతున్నాయన్న విషయం పోలీసుల దర్యాప్తుల్లో రూఢి అయింది. సెంట్రల్ జైల్లో ఎక్కువ మంది ఈ ఖైదీలే ఉండడంతో అక్కడ కూడా గంజాయి సాగు చేసిన ఉదంతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. విశాఖ కెజిహెచ్ సమీపాన కూడా గంజాయి సాగు గతంలో బట్టబయలైంది. వార్డు బారులు, కొంతమంది రోగులు, వారి బంధువులు వినియోగించినట్టు వెల్లడైంది. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు గంజాయి వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఇచ్చిన హామీ నీటిమీద రాతగానే మిగిలింది. మూలాల్లోకి వెళ్లాలని, తయారీదారుల, సరఫరాదారుల ఆటకట్టించాలని ప్రజలు కోరుతున్నారు

# గాజాలో ఆగని దాడులు.. 70వేలను దాటిన మృతులు



**గాజా :** రెండేళ్లకు పైగా ఇజ్రాయిల్ చేపడుతున్న దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 70,000ను దాటినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు నమోదైన మొత్తం మరణాల సంఖ్య 356కి చేరినట్లు వెల్లడించింది. ఇజ్రాయిల్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూనే ఉంది. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో 70,112మంది పాలస్తీనియన్లు మరణించగా, 1,70,000మందికి పైగా గాయపడ్డారని గాజాఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదించింది. కాల్పుల విరమణ సమయంలో కూడా, శిథిలాల నుండి మృతదేహాలను వెలికితీస్తున్నారని, పౌరుల లక్ష్యంగా ఇప్పటికీ దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. అమెరికా మధ్యవర్తిత్వంతో అక్టోబర్ 10న కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటికీ.. వారాంతంలో ఇజ్రాయిల్ దాడుల్లో భారీ ప్రాణనష్టం సంభవించిందని పేర్కొంది. వారాంతంలో మొత్తం మరణాల సంఖ్య 70,000 దాటిందని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. శనివారం అల్-ఫరాబి పాఠశాల సమీపంలో ఇజ్రాయిల్ డ్రోన్లు జరిపిన దాడిలో దాడి చేసి, ఫాది మరియు జుమా టామర్ అబు అస్సీ అనే ఇద్దరు సోదరులు మరణించినట్లు తెలిపింది. ఆదివారం జరిగిన ఇజ్రాయిల్ దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందం మొదటి దశలో భాగంగా.. ఇజ్రాయిల్ 15మంది పాలస్తీనియన్ల మృతదేహాలను గాజాకు తిరిగి తరలించింది. గత 40రోజులుగా గాజా భూభాగంలోని దక్షిణ భాగంలో 40మంది హమాస్ సభ్యులను చంపినట్లు ఇజ్రాయిల్ సైన్యం ఒక ప్రక టనలో తెలిపింది. నిరంతరం దాడులు, పెరుగుతున్న మరణాలు ప్రస్తుత కాల్పుల చుట్టూ ఉన్న అస్థిరతను, గాజా అంతటా పౌరులు ఎదుర్కొంటున్న నిరంతర ప్రమాదాలను ఎత్తి చూపుతోందని పాలస్తీనా జర్నలిస్ట్ అహ్మద్ అషాఫ్ పేర్కొన్నారు.




# సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేసిన విరాట్ కోహ్లీ



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. రాయ్‌పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో శతకంతో కదం తొక్కాడు. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీతో మెరిసిన కోహ్లీ, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఓ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో 90 బంతుల్లోనే తన 53వ వన్డే సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్‌గా అతనికి ఇది 84వ అంతర్జాతీయ శతకం. మొత్తం 93 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 102 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆరంభంలోనే రోహిత్ శర్మ వికెట్ కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన కోహ్లీ, ఇన్నింగ్స్‌ను నిర్మించే బాధ్యతను తీసుకున్నాడు. యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి మూడో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలోనే కోహ్లీ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో అత్యధిక సార్లు (32 సార్లు) 150 పరుగులకు పైగా భాగస్వామ్యాలు నెలకొల్పిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ రికార్డు ఇప్పటివరకు సచిన్ టెండూల్కర్ (31) పేరిట ఉండేది.

కోహ్లీతో పాటు రుతురాజ్ గైక్వాడ్ కూడా సెంచరీతో రాణించడంతో టీమిండియా భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. చివర్లో కేఎల్ రాహుల్ 43 బంతుల్లోనే 66 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో దక్షిణాఫ్రికా ముందు 359 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ నిర్దేశించింది.

# రాయ్‌పూర్‌లో పరుగుల వరద.. సెంచరీలు చేసిన కోహ్లీ, రుతురాజ్..



రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా బ్యాటర్లు పరుగుల వరద పారించారు. విరాట్ కోహ్లీ (102) తన రికార్డును మరింత మెరుగుపరుచుకుంటూ 53వ వన్డే సెంచరీ సాధించగా, యువ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ (105) తన కెరీర్‌లో తొలి వన్డే శతకాన్ని నమోదు చేశాడు. వీరిద్దరి అద్భుత ప్రదర్శనకు కేఎల్ రాహుల్ మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీ స్కోరు సాధించింది.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 62 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులో నిలిచిన విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ మూడో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు.

శతకాలు పూర్తి చేసుకున్న తర్వాత వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో కేఎల్ రాహుల్ దూకుడును ప్రదర్శించాడు.

కేవలం 43 బంతుల్లోనే 66 పరుగులు చేసి అజేయంగా నిలవడంతో భారత స్కోరు 350 మార్కును దాటింది. సఫారీ బౌలర్లలో మార్కో యన్సెన్ 2 వికెట్లు పడగొట్టగా... ఎంగిడి, బర్గర్ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్ గెలవాలంటే దక్షిణాఫ్రికా 359 పరుగులు చేయాలి. మూడు వన్డేల సిరీస్‌లో ఇప్పటికే భారత్ మొదటి వన్డేలో గెలిచి 1-0తో ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.




# ‘ది రాజా సాబ్’

## సినిమా రన్ టైమ్ 3.14 గంటలు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానుల్లో ‘ది రాజా సాబ్’ ఫీవర్ అప్పుడే మొదలైంది. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి వచ్చిన ఒకే ఒక్క అప్‌డేట్‌తో సోషల్ మీడియాలో సందడి నెలకొంది. అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కావడంతో సినిమా రన్‌టైమ్ బయటకు వచ్చింది. ఏకంగా 3 గంటల 14 నిమిషాల నిడివితో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అంచనాలు అమాంతం పెరిగాయి.

మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమెరికాలోని ప్రముఖ టికెట్ బుకింగ్ వెబ్‌సైట్లలో ఈ సినిమా రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా మారుతి సినిమాలు తక్కువ నిడివితో ఉంటాయి. కానీ, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. ‘సలార్’, ‘కల్కి’ చిత్రాల తరహాలోనే ఈ సినిమా కూడా సుదీర్ఘ రన్‌టైమ్‌తో ప్రేక్షకులకు పూర్తిస్థాయి వినోదాన్ని పంచనుంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. యోగిబాబు, బ్రహ్మాజీ, మురళి శర్మ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని డిసెంబర్ 2025లో విడుదల చేయాలని భావించినా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. 2%ఐ, 3ఐ%, ఐమ్యాక్స్ ఫార్మాట్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజా అప్‌డేట్‌తో ప్రభాస్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీలో ఉండగా, త్వరలోనే ట్రైలర్, పాటల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విడుదలైన రోజే కలెక్షన్లు కొట్టేయాలన్న ఉద్దేశం లేదు

## హీరో రామ్




యంగ్ హీరో రామ్ పోతినేని తన తాజా చిత్రం ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ విడుదల విషయంలో ఒకానొక దశలో భయపడినట్లు వెల్లడించారు. గతంలో వెంకటేశ్‌తో కలిసి తాను నటించిన ‘మసాలా’ సినిమా నవంబర్‌లో విడుదలై ఆశించిన విజయం సాధించలేదని, ఆ సెంటిమెంట్‌తో ఈ సినిమా నవంబర్ రిలీజ్‌కు కాస్త ఆందోళన చెందానని తెలిపారు. చిత్ర యూనిట్ నిర్వహించిన థాంక్స్ మీట్‌లో ఆయన ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. ఎక్కువ మంది ప్రేక్షకులు చూడాలనే ఉద్దేశంతోనే ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ తీశామని, కానీ కొన్ని పరిస్థితుల వల్ల అన్ సీజన్‌లో విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. ఈ సినిమాకు తాను ఎంతగానో కనెక్ట్ అయ్యానని, అందుకే ఏ సినిమాకూ చేయనంత ప్రచారం చేశానని వెల్లడించారు. హీరో-అభిమాని మధ్య ఉండే అనుబంధాన్ని చూపించే చిత్రం ఇది అని వివరించారు.

సినిమా ఫలితంపై స్పందిస్తూ.. మిగతా సినిమాల విషయంలో హిట్టా? ఫట్టా? అని ఆలోచిస్తాం కానీ ఈ సినిమా విషయంలో ఇది మంచి సినిమా అని ప్రేక్షకులు వెంటనే గుర్తిస్తారా లేక ఆలస్యంగా గుర్తిస్తారా అనేదే తమ ఆలోచన అని అన్నారు. విడుదల రోజే కలెక్షన్ల రికార్డులు కొట్టాలన్న ఉద్దేశం తమకు లేదని, ప్రేక్షకుల అభిప్రాయాన్ని తాను గౌరవిస్తానని అన్నారు. ప్రేక్షకులకు నచ్చకపోతే ఆ విషయాన్ని అక్కడితో వదిలేస్తానని రామ్ స్పష్టం చేశారు.

నవంబర్ 27న విడుదలైన ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషించగా, ఆయన వీరాభిమానిగా రామ్ నటించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే, దర్శకుడు పి. మహేశ్‌బాబు, నిర్మాత రవిశంకర్ పాల్గొన్నారు.

# : ‘అఖండ 2’లో ఆ సర్‌ప్రైజ్ ఇదే.. అసలు విషయం చెప్పిన బోయపాటి శ్రీను





నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ‘అఖండ 2’ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ఎల్లుండి ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్ల వేగం పెంచిన చిత్రబృందం, తాజాగా ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. ఈ చిత్రంలో బోయపాటి శ్రీను చిన్న కుమారుడు వర్షిత్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. అయితే ఆ పాత్ర ఏంటనే సస్పెన్స్‌కు దర్శకుడు బోయపాటి స్వయంగా తెరదించారు. ‘అఖండ 2’లో తన కుమారుడు వర్షిత్ ‘భక్త ప్రహ్లాదుడు’గా కనిపించనున్నాడని బోయపాటి శ్రీను తన ఎక్స్ ఖాతా ద్వారా స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తాను సినిమాలో నటిస్తున్నట్లు వర్షిత్ చెప్పినప్పటికీ, పాత్ర వివరాలు మాత్రం వెల్లడించలేదు. అయితే, సినిమా ట్రైలర్‌ను జాగ్రత్తగా గమనిస్తే ప్రహ్లాదుడి గెటప్‌లో ఉన్న బాలుడిని చూడవచ్చని బోయ పాటి తెలిపారు. ఆధునిక కథాంశంతో సాగే ఈ సినిమాలో భక్త ప్రహ్లాదుడి పాత్రను ఎలా జోడించారు, దాని ప్రాముఖ్యత ఏంటనేది మాత్రం ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు.

ఈ చిత్రంలో ఆది పినిశెట్టి ప్రతినాయకుడిగా నటిస్తుండగా, హర్షాలి మల్హోత్రా, పూర్ణ, కబీర్ దుహన్ సింగ్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ మిలియన్ల వ్యూస్‌తో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ సీక్వెల్, మొదటి భాగాన్ని మించిన విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**